# బ్రతుకున బ్రతుకై

"ఆకాశపు ఎడారిలో కాళ్ళు తెగిపడిన ఒంటరి ఒంటెలా ఉంది జాబిలి—అన్న దెవర్రా?" సముద్రపు టొడ్డున ఇసుకలో వెల్లకిలా పడుకుని నింగిలోని నిండు జాబిలి వంక చూస్తూ అన్నాడు రవి.

"తెలుగులో అంత గొప్పగా చెప్పగల వాళ్ళెవరున్నార్లే మా శ్రీశ్రీ తప్ప!" రవి ప్రక్క కూర్చునున్న మూర్తి అన్నాడు.

"నీ ఫేవరిజం పోనిచ్చుకున్నావు కాదు."

"దానికేంలేగాని ఆ మాట లిప్పుడెందుకు గుర్తొచ్చాయిరా?"

"నా బ్రతుకూ అలాగే ఉంది గనుక."

నిర్లిప్తంగా అన్న రవివంక బాధగా చూశాడు మూర్తి.

"అందుకే నా అను, నీకు నచ్చే అమ్మాయిని వెదకి తెస్తానూ అని వందోసారి అంటున్నాను."

"మూర్తీ! ప్లీజ్..."

"ఎప్పుడూ ఇదే ధోరణా? నీ పద్ధతేం బాగు లేదు రవీ! ఇవాళ్టిదాకా అయితే నేనున్నాను గనుక స్నేహితులుగా, రూమ్మేట్స్‌గా సరదాగా గడిపేశాం కాలాన్ని. కాని రేపట్నించి...ఎవర్తోనూ తేలిగ్గా కలవలేని నీ పరిస్థితి తలుచుకొంటుంటే చాలా బాధగా ఉంటోందిరా."

"ముందే చెప్పేనుగా—కాళ్ళు తెగిపడిన ఒంటరి ఒంటెలా అని."

"అంతేగాని పెళ్ళికొప్పుకోనంటావ్? పోనీ ఇప్పుడైనా చెప్పరా—పెళ్ళంటే నీకెందుకంత విరక్తి?"

రవి మౌనం వహించాడు.

ఏం చెప్పాలి సమాధానం? అసలు సరియైన సమాధానం ఏమిటి? రాజీని ప్రేమించడమా? నిజంగా అది ప్రేమేనా? ఏమో! అది ప్రేమ కావచ్చు. ఆకర్షణ కావచ్చు. ఆరాధన కావచ్చు లేదా మోహం కావచ్చు. లేక ఇంకేదైనా కావచ్చు. కాని దానిని తను ప్రేమే అనుకున్నాడు. తను ప్రక్కింటి రాజీని—తనకన్నా రెండేళ్ళు పెద్దదైన రాజీని ప్రేమించాడు. సినిమాల్లో నవలల్లో హీరో హీరోయిన్‌ని ప్రేమించినట్లే తనూ ప్రేమించా ననుకున్నాడు. ఎప్పుడు? తను యస్సెల్సీ, ఆమె డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నప్పుడు! ఆమె సంతోషంకోసం, ఆమె మెప్పుకోసం ఎన్నెన్నో చేసేవాడు. రోజూ ఉదయం రెండు గులాబీ పూలు ప్రత్యేకంగా పట్టుకెళ్ళి ఇచ్చేవాడు. ఆమె క్కావాల్సిన నోట్సులు ఆమె స్నేహితుల దగ్గర్నుంచి తెచ్చి పెట్టేవాడు. సినిమాకి తోడు రమ్మంటే భక్తుడల్లా వెంట నడిచేవాడు. తనింటి కొచ్చికబుర్లు చెబితే ఇంద్రపదవి లభించినట్లు పొంగిపోయేవాడు.

కడకేమయ్యింది?

తను యస్సెల్సీ పాసైనట్టు చెప్పగా ఆమె ఎంతో సంతోషించి పార్టీ అడగ్గా హోటల్లో ఆమె కొక్కతికే పార్టీ ఇస్తూ—"మిమ్మల్ని ప్రేమిస్తున్నానంటే" అన్నప్పు డామె పగలబడి నవ్వి "తప్పమ్మా. అలాటి పెద్ద మాటలన కూడదు" అంది. తను నిజంగా ప్రేమిస్తున్నానని చెప్పి నప్పుడు—"పిల్లీ. నువ్వు నన్ను ప్రేమించడం ఏమిటి?" అని తీసిపారేసింది.

అదిగో అప్పుడే అనుకున్నాడు—ఆమెమీది ప్రేమకి నిదర్శనంగా అజన్మ బ్రహ్మచారిగా ఉండి పోవాలని.

రాజీ పెళ్ళయి వెళ్ళిపోయింది. తన పెళ్ళి చూడాలని తపిస్తూనే అమ్మ పరలోకం వెళ్ళి పోయింది. అన్నయ్యలు మందలించి మందలించి పూరుకున్నారు. తమ్ముడు ఒక ఏడాది ఆగి పెళ్ళి చేసేసుకున్నాడు. నీ దగ్గరుండలేనంటూ నాన్న అన్నయ్యల దగ్గరుంటున్నాడు.

ఫలితం ?

ఒంటరితనం. బంధువర్గంలో ఫలానా రవి అసలు పెళ్ళి చేసుకోడంట అన్న ప్రచారం. తను తన నిర్ణయానికి గట్టిగా కట్టుబడటానికి ఆ ప్రచారమూ, తమ్ముడి పెళ్ళీ కూడా గట్టి కారణాలే. లేకపోతే ఈపాటికి తను పెళ్ళి చేసేసుకునేవాడే నేమో! ఇప్పుడు—ముప్పయి రెండేళ్ళు నెత్తిమీది కొచ్చేక, ఇంత ప్రచారం జరిగేక పెళ్ళి చేసుకుంటా నంటే పగలబడి నవ్వరూ? రాజీ కూడా తన పరిహాసం చేసుకోదూ? అయినా సంసారం మహా సాగరంలే. దిగు దిగు అనేవాళ్ళేగాని దిగేక మునిగి పోతున్నాను మొర్రో అన్నా ఒక్కరూ రారు ఆదుకోడానికి! ప్చ్.....ఏమైతేనేంలే ఇక ఈ జీవితానికింతే...

"ఏమిట్రా అలా గువ్వలా ఉండిపోయావ్?"

మూర్తి మాటలకి ఉలిక్కిపడ్డాడు రవి.

ఒకసారి దీర్ఘంగా నిట్టూర్చి వాచీ చూసి "చాలా పొద్దుపోయిందిరా. ఇక లేద్దామా?" అన్నాడు రవి.

"అంతేకాని నా ప్రశ్నకి జవాబివ్వ వన్నమాట. సరేలే కాని ఒకటి మాత్రం మరిచిపోకు రవీ! పెళ్ళితో కాని మనిషి జీవితం పరిపూర్ణం కాదు. కరిగిన యౌవనం జరిగిన కాలం తిరిగి రావు. ఎవరో ఏదో అనుకుంటా రనుకుని నీ జీవితాన్ని రసహీనం చేసుకోకు. నే నెందుకిలా చెబుతున్నానో ఆలోచించు. నీ అభిప్రాయం మారితే నాకు తెలియ చెయ్యాలు. మిగిలింది నేను చూసుకుంటాను. ఇకపోతే నా పెళ్ళికి రానటం మానకు. పెళ్ళయిన వెంటనే ఫామిలీ పెట్టేస్తాను. కనక మనిద్దరం కలిసి ఉండే ఆఖరి రాత్రి ఇదే అనుకుంటాను"

**సింహ ప్రసాద్**

రవి మాట్లాడలేదు.

రెండేళ్ళ నుండి రూమ్మేట్స్‌గా ఉంటూ ఎంతో అన్యోన్యంగా కలిసి పోయారు. ఇప్పుడు మూర్తి కొత్త జీవితాన్ని వెదుక్కుంటూ వెళ్ళి పోతున్నాడు.

తను?

## 2

"రవిగారూ" అంటూ గదిలో కొచ్చింది ఎదురింటి ప్లీడర్‌గా రమ్మాయి జ్యోతి.

అతడు సామానుకేసు సర్దుకుండటం చూసి—"ఎక్కడకో ప్రయాణ మవుతున్నట్లున్నారే?" అంది.

"అవునండీ. రేపు మా మూర్తిగాడి పెళ్ళండీ. నాల్రోజులు ముందే రమ్మన్నాడు కాని ఇవ్వాల్టిగ్గాని వీలు పళ్ళేదు."

పెళ్ళి మాటెత్తేసరికి కామె ముఖంలో ఒక క్షణం పాటు తారట్లాడిన నీలి మేఘా లతడి దృష్టి నుంచి తప్పించుకో లేకపోయాయ్. కళాహీనంగా ఉన్న ఆమె మోముని చూసి కదిలి పోయాడతడు. ఆమె జీవితం ఇలా వితంతువు లానే రాలి పోవలిసిందేనా అని బాధ పడ్డాడు.

"ఏమి టాలోచిస్తున్నారు? నా అభాగ్యత్వాన్ని తలచా?" రాబోతూన్న కన్నీళ్ళను నిగ్రహించుకుంటూ అంది నవ్వ ప్రయత్నిస్తూ.

"అబ్బే ఏం లేదు. కూర్చోండి. ఏమైనా పుస్తకం కావాలా?"

అక్కర్లేదన్నట్టు తల అడ్డంగా వూపి చెంగు చాటున దాచి తెచ్చిన కప్పు అందిచ్చింది జ్యోతి.

"ఇదేమిటండీ?"

"జాన్సు".

"నిజవా! జున్ను నాకు చాలా ఇష్టం."

"మా పని మనిషి చెప్పింది."

"ఓ" సాభిప్రాయంగా చూస్తూ అన్నాడు. ఆమె తల దించుకుంది.

## 3

పెళ్ళి పందిరి పచ్చని తోరణాలతో రంగురంగుల విద్యుద్దీపాలతో పట్టు చీరలతో నవ్వులతో పువ్వులతో పరాచికాలతో పరామర్శలతో హడావిడితో, ఆడంబరాలతో కళకళ లాడుతూంది.

కుర్రాళ్ళంతా ఒక చోటు చేరి కబుర్లు చెప్పుకుంటూ మధ్య మధ్య అటూ ఇటూ తిరుగుతూన్న ఆడవాళ్ళ మీాద కామెంట్ చేస్తూ నవ్వుకుంటున్నారు.

వాళ్ళలా తను సరదాగా నవ్వుతూ ఎందుకుండలేకపోతున్నాడని ఆలోచిస్తూ ఒక పక్కన ఒంటరిగా నిలబడ్డాడు రవి. ఎవరితోనూ కలవకుండా ఎప్పుడూ సీరియస్‌నెస్‌ని ముఖానికి తగిలించుకుని ఏదో పెద్ద వయస్సొచ్చేసినట్లుగా తనెందు కుంటున్నాడో అతడికర్థం కాలేదు. ఇది ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ కాదు కదా అనిపించిందికూడా.

మంగళస్నానం చేసి మంగళ వాయిద్యాలు వింటూ పెళ్ళి కూతురి మెడలో మంగళ సూత్రం కట్టాడు మూర్తి. ఆ దృశ్యం చూస్తూ పెళ్ళి ఒక అనిర్వచనీయమైన అనుభూతి సుమా అనిపించింది రవికి. పెద్దల ఆశీర్వాదాలు, అక్షింతలు చూసి ఇందరి పెద్దల దీవెనలు వృధా పోతాయా అనిపించింది.

అంతలోనే—"ఈ ముచ్చట మూణ్ణాళ్ళేలే. రేపటి నుంచి భార్య సాధిస్తూంటే, పిల్లలు గోలపెడుతూంటే తెలుస్తుంది సంసార జంఝాటమంటే ఏమిటో" అనుకున్నాడు విరక్తిగా.

కాని ఆ భావం ఎంతో సేపు నిలవ లేదు నిలపాలని ఏంత ప్రయత్నించినా!

## 4

సముద్రుడు అశాంతితో అలమటిస్తున్నాడు.


ఒక ఎత్తైన బండ మీాద కూర్చుని అనంత సముద్రం వైపు చూస్తున్న రవి మనస్సుకూడా అలాగే ఉంది.

కాస్త తీరికదొరికితే చాలు ఇక్కడికొచ్చి ఇదే చోట గంటలతరబడి కూర్చోవడం రవికి అలవాటు. ఆ ఏకాంతం, ఆ ప్రకృతి దృశ్యం అతడ్నెంతో ఉత్తేజపరుస్తూండేవి. ఇప్పుడు ఆ ఏకాంతమే బాధాకరంగా పరిణమించింది. మెదడులో విరుద్ధ భావాలు సంఘర్షించుకుంటూ అతడ్ని అశాంతిపాలు చేస్తున్నాయ్. మూర్తి పెళ్ళికి వెళ్ళొచ్చినప్పట్నుంచీ అతన్లో ఒకరకమైన మార్పు వచ్చింది. దానికితోడు అవాళ అతడి తండ్రి దగ్గర్నుంచో ఉత్తరం వచ్చింది...

జేబులోంచి ఉత్తరం తీసి పదోసారి చదివాడు.

"బాబూ! నీ దగ్గర్నుంచి ఈమధ్య బొత్తిగా ఉత్తరాలు రావటంలేదు. నెలకొక్కటైనా నీ దగ్గర్నుంచి రాకపోతే నా మనస్సు మనస్సులో ఉండదురా బాబూ. నా పిల్లలంతా ప్రయోజకులైనందుకు సంతోషమేరా. కాని మిగిలిన వాళ్ళలా నువ్వు సంసారం చేసుకుంటూ సుఖంగా ఉండక తాడూ బొంగరం లేనివాళ్ళా ఉంటున్నందుకేరా నా దిగులంతా. వయస్సులో ఉన్నా వీ కిప్పుడు ఆడతోడు ఆవశ్యకత గురించి తెలీకపోవచ్చు. అదో లోపంగా అన్పించకపోవచ్చు. కాని బాబూ! రేపు కాలూ చెయ్యీ వంగినప్పుడు మనల్ని కంటికి రెప్పలా కాపాడేది కట్టుకున్న ఆడదేరా. నా సంగతే చూడు. మీా అమ్మ ఉన్నప్పుడు నా అవసరాలు కనిపెట్టి నోరు తెరిచి అడక్కుండానే అన్నీ అమర్చేది. ఇప్పుడు కొడుకులూ కోడళ్ళూ అంతా ఉన్నారు. ఏం లాభం? నాలుగుసార్లు పిలిస్తే గాని పలకరు. పలికినా విసుక్కుంటారు. విసుగుళ్ళూ సణుగుళ్ళూ తప్ప అవసరం తీర్చడం అరుదు. మీా అమ్మ బతికుంటే నాకిలాటి రాత వచ్చేదా చెప్పు? అందుకేరా నాన్నా—భార్య అంటే ఆజన్మాంతం తోడు నీడగా ఉండే స్నేహితురాలు అన్నారు పెద్దలు. నీ నిర్ణయం గురించి మరోసారి ఆలోచించరా. నువ్వు రేపో మాపో సన్యాసుల్లో కలిసిపోతావంటూ మీా వదినలంటుంటే విన్లేక పోతున్నారా బాబూ. నువ్వొకవేళ ఎవర్నైనా ప్రేమించి వుంటే ఆ పిల్ల ఏ కులస్థురాలైనా సరే—మా కెలాటి అభ్యంతరమూ ఉండదురా కన్నా. మాక్కావల్సిందల్లా నువ్వో ఇంటివాడివై, పిల్లా పాపల్తో సుఖంగా ఉండటమేరా. వెంటనే





జవాబు రాస్తావని ఆశిస్తూ—

నీతండ్రి

పట్టాభి రామయ్య."

నిట్టూర్చి ఉత్తరాన్ని చించెయ్యబోయే ఆగి దానిని జేబులో దాచేశాడు. ఉత్తరంలోని విషయం గురించి ఆలోచించలేక ఆలోచించకుండా ఉండలేక సతమతమవుతూనే లేచాడు. వెనుదిరగబోతూ సముద్రంవంక చూశాడు.


సముద్రు డెందుకిలా అవిశ్రాంతిగా దుఃఖిస్తూ తపిస్తున్నాడు?

తోడుకోసమా? ఏమో!

మవునాన్ని భుజాన మోసుకుంటూ ఇంటి కెళ్ళాడు.

మనస్సుని మరోవైపు మరలిస్తే గాని ఆ విషయాన్ని మర్చిపోలేననుకుని పేలెట్ అందుకుని రంగులు కలపసాగాడు రవి.

నిజానికి రవి ఒక చిన్న ఆర్టిస్టు. కాని చిత్రకళంటే అతడి కంతులేని తపన. ఆరాధన. రాత్రీ పగలూ అని లేకుండా ఎన్నోసార్లు ఎన్నో గంటలు దీక్షగా చిత్ర సృష్టి చేస్తూ కాన్వాసుపై ప్రకృతికి ప్రాణం పోస్తూండి పోయాడు. కాని ఆ చిత్రాల్నెప్పుడూ ఎవరికీ చూపించి ఎరుగడు. అవి కేవలం ఆత్మ తృప్తికే. కాని ప.శాస్త్రి వాటిని చూట్టం, మెచ్చుకోవడం, ఒక చిత్రకళా పోటీకి అతడి ఒక చిత్రాన్ని పంపడం కూడా జరిగిం దీ



మధ్యనే. అవాళ్టినుంచీ అతడికి తెలీకుండా పదిమందీ మెచ్చుకునే చిత్రాలు గీయాలన్న తపన మొదలయ్యింది!

స్టేండ్‌మీద కేన్వాస్ పెట్టి బ్రష్ చేతబట్టి గంటసేపు ప్రయత్నించాడు గాని మనోదృష్టి ఒక్క దృశ్యంమీదా నిలవకపోయేసరికి పేలెట్‌నీ, బ్రష్‌నీ ఒక ప్రక్కన పడేసి ఉస్సురంటూ కూల బడ్డాడు కుర్చీలో.

## 5

తెల్లవారుజామున చలిగా అనిపిస్తే దుప్పటి కప్పుకున్నాడు రవి. కాని చలి అంతటితో ఆగలేదు. అంతకంతకీ అధికమై అతడ్ని కుదిపెయ్య సాగింది. రెండు దుప్పట్లు కప్పుకున్నా లాభం లేకుండా ఉంది. నోరంతా ఒకటే చేదు. ఒళ్ళు పెనంలా కాలిపోతుంది. ఒంట్లో ఎంతో నిస్సత్తువ. వణకుతూ మూలుగుతూ ముడుచుకుని పడు కున్నాడు. ఎన్నడూ లేనిది తను మూలుగుతున్నాడని గుర్తించి కలవరపడ్డాడు. ఇది చలి జ్వరమా లేక విషజ్వరమా అని బెంబేలుపడసాగాడు.

తెల్లవారి చాలా సేపయ్యింది. పనిమనిషి వస్తుందికదా ఏ డాక్టర్నన్నా పిలవమందామను కుంటూ ఎదురు చూస్తుంటే గడియారంలోని చిన్న ముల్లు ఎనిమిదంకె దాట ప్రయత్నిస్తుంది. ఇక ఇవాళ్టి కామె రాదని నిర్ధారణ చేసుకుని లేచి ఎలా వోలా ముఖం కడుక్కున్నా నన్పించి వీధిలో కెళ్ళి ఏ పిల్లాడిచేతన్నా టాబ్లెట్ తెప్పించుకుందా మని చూశాడు గాని మరి ఒంట్లోని శక్తి అంతా ఎప్పుడెలా ఆవిరై పోయిందోగాని, లేచి రెండడుగు లెయ్యగల శక్తి కూడా లేదు. తన్ను తాను నిందించు కుంటూ పడుకుండిపోయాడు.

రవికి మూర్తి గుర్తొచ్చాడు.

వాడే ఉంటే డాక్టర్ని తీసుకొచ్చి మందులు తెచ్చి మొఖం కడుక్కోడానికి వేణ్ణీళ్ళు కాచి తేన డానికి చెయ్యి అందిచ్చి ఎంత హంగామా చేసేవాడు! ప్చ్....నాన్న అన్నట్టు భార్య ఉంటే తన నిప్పుడు కంటికి రెప్పలా చూసేదికాదూ? కనీసం తన అనారోగ్యం గురించి విచారించేవారూ, మందూ మాకూ అమర్చేవారూ కనుచూపు మేరలో కూడా ఎవరూ లేరిప్పుడు. ఎవరైనా ఏదైనా పనిమీద తన గదికొస్తే తప్ప తనంటూ ఒక మనిషి చలి జ్వరంతో అల్లాడిపోతున్నాడని తెలీదు లోకానికి. ఒకవేళ వూపిరి విడిచినా నలుగురికీ తెలిసేప్పటి కెన్నో రోజులు పడుతుంది. తన బ్రతుకంత అనామకమై పోయిందని!

దుఃఖం పొర్లి వచ్చింది రవికి.

## 6

"శ్రీశ్రీశ్రీ రవిగారికి మా కొత్త సంసారం హృదయపూర్వక స్వాగతం పలుకుతుంది" నాటకీయంగా అన్నాడు మూర్తి రవి నాహ్వానిస్తూ.

నవ్వి వూరుకున్నాడు రవి.

"ఏమిట్రా బాగా చిక్కిపోయావ్?"

"ఈమధ్య నాల్రోజులు కాస్త జ్వరం వచ్చిందిలే."

"మరి నీ మంచీ చెడ్డా ఎవరు చూశార్రా" ఆదుర్దాగా అడిగాడు

"ఎవరో నీలాటి మంచివాళ్ళు."

"ఎవరో దయాదాక్షిణ్యాలమీద ఆధారపడే కన్నా మన మనిషి సహకారంమీద ఆధారపడటం ఎంతో మంచిదంటే వినవ్. సరిసర్లే—భోజనానికి పిలిచి ఉపన్యాసాలిస్తున్నానని తిట్టి పొయ్యగలవ్. సీతా! మా రవి వచ్చాడు. వెంటనే రావాలి"...

"వచ్చే వచ్చే" అంటూ వటింట్లోంచి వచ్చింది సీత.

పెళ్ళికూతురిగా కన్నా ఇప్పుడే నిండుగా, అందంగా ఉన్నట్టనిపించింది రవికి.

పరిచయాలూ, నమస్కారాలూ అయ్యాయి.

"కూర్చోండన్నయ్యగారూ—ఆయనెప్పుడూ మీ గురించే చెబుతూంటారు."

సీత మాటలకి గతుక్కుమన్నాడు రవి. తన గురించంటే తన పెళ్ళి అయిష్టత గురించా?

"కబుర్లు తర్వాత. ముందు ఆత్మారాముడు గోల చేస్తున్నాడు గాని పద పద అరేంజ్ చేద్దాం. ఒక్క నిమిషంరా...." అంటూ భార్యతోబాటు లోపలి కెళ్ళాడు మూర్తి.

కుర్చీలో కూర్చుని అందంగా తీర్చి దిద్దబడిన ఆ గదిని చూడసాగాడు రవి. ఒక ప్రక్కన పుస్తకాల రాక్, టేబుల్, దానిమీద రకరకాల బొమ్మలూ ప్రతిమలూ వగైరా, గోడలకి రెండు పెయింటింగ్స్, ఫొటోలు, గుమ్మాలకీ కిటికీలకీ ఎంబ్రాయిడరీ వర్కు చేసిన తెరలు...మొత్తాని కా గది అందంగా, ప్రశాంతంగా చక్కని అభిరుచికి ప్రతిబింబంగా ఉంది.

"ఇక్కడ కూర్చుంటే ఎంత హాయిగా ఉందీ. ఇలాటి చక్కని ప్రశాంత వాతావరణంకోసమే పూర్వం ఋషులు అడవులకు పోయేవారు కాబోలు. ఇంత చక్కని ప్రదేశంలో ఎలాటి మనసైనా సేద దేరుతుంది. ఆనందనృత్యం చేస్తుంది" అనుకున్నాడు.

అంతలో మూర్తి బద్ధకం గుర్తొచ్చింది. బట్టల్ని ఒక పద్ధతి ప్రకారం దండానికి తగిలించడం గాని, దుప్పట్లని మడతపెట్టి ఉంచడంగాని, పుస్తకాల్ని నీట్‌గా సర్దటంగాని చేసేవాడుకాదు. గదంతా చిందరవందరగా ఉండేది. తనెన్నిసార్లు చెప్పినా పట్టించుకునేవాడే కాదు. ఆఖరికి మూడు రోజులకోసారి గెడ్డం గీసుకోవాల్సి వస్తోందని "ఆడ వాళ్ళలాగా మనకీ గెడ్డం రాకపోతే ఎంత బావుణ్ను. జీవితంలో నాలుగోవంతు గెడ్డం గీసుకోడానికే సరిపోతుందిరా నాయనా" అనేవాడు. అలాటి మూర్తి ఇల్లు....బహుశా ఇదంతా అతడి ఇల్లాలి మహాత్మ్యం కాబోలు! మూర్తి నిజంగా అదృష్ట వంతుడే!

సీత కొసరి కొసరి ఆప్యాయంగా వడ్డిస్తుంటే రవి కళ్ళు చెమ్మగిల్లాయ్. ఇదివరకు అమ్మ ఇంత ఆప్యాయత కురిపించేది. మళ్ళీ ఇన్నేళ్ళకి ఇంత ప్రేమగా వడ్డిస్తుంది ఈ చెల్లి! ప్రేమతో పెట్టిన పచ్చడి మెతుకుల ముందు పరమాన్నం ఎందుకూ పనికిరాదనడంలో ఎంత నిజముందీ!

భోజనాలయ్యాక కాస్సేపు కబుర్లు చెప్పుకుని అప్పుడప్పుడూ తప్పక వస్తానని మాట ఇచ్చి ఇంటి కొచ్చేశాడు రవి.

తన రూమ్‌వైపెళ్తూ ఆగి వెనుదిరిగిచూశాడు. ఎదురింటి కిటికీ దగ్గర లాయర్‌గారమ్మాయి జ్యోతి తనవంకే చూస్తూంది. ఆ కళ్ళల్లో ఎంత ఆరాధన! ఒకప్పుడు రాజీని తను ఇలాగే చూసే వాడు. రాజీ తనని కాదనేసింది గాని తను రాజీ వదలేకుండా ఉన్నాడు...

జ్యోతి—నిజంగా జీవన జ్యోతి—తనకి జ్వరం వచ్చినప్పుడు కంటికి రెప్పలా చూసిందామె. అలాటి ఆమె జీవితం అలా రాలిపోవల్సిందేనా? చిత్రం. ఆమె ఏకాకి అంటూనందున ఆమె జీవితం నిస్సారమనుకుంటూ తను జాలిపడుతున్నాడు మరి తనమాట?

తన సంగతి వేరు. తను పెళ్ళి చేసుకోనని గొప్పగా చెప్పాడు. ఇప్పుడు చేసుకుంటానంటే బంధువులూ మిత్రులూ ఆఫీసు జనమూ ఏమను కుంటారు? నవ్వరూ? గేలిచెయ్యరూ? తను రాజీని ప్రేమించలేదనుకోరూ ఆమె?

ప్చ్...

నిట్టూర్చి వెనుదిరిగాడు.

## 7

"రవిగారు ఎవరు సార్" ఆఫీసులోకొస్తూ అడి గాడు పోస్టుమేన్.

"నేనండి."

"మీకు టెలిగ్రాం వచ్చింది సార్."

"టెలిగ్రామా?...తండ్రి కేమయ్యిందో? ఎలా ఉందో ఏమిటో అని ఇదవుతూ వణకుతున్న చేతులతో టెలిగ్రాం అందుకున్నాడు.

ఒక్కసారే అతన్లో కోటి వీణలు వరాగా లాలాపించాయ్. లక్ష కోయిలలు గళం విప్పాయ్. ఆనందం. పరమానందం. అతడి ఒడలంతా ఉత్సాహంతో ఉత్తేజంతో ఉప్పొంగుతుంది.

అపూర్వనుభూతి. అతడిలోని కళాత్మకతకీ తపనకీ తపస్సుకీ ఇవాళ గుర్తింపు లభించింది. అది గుర్తింపుకాదు—గౌరవం. చాల అరుదుగా లభించే గౌరవం.

ఆమధ్య రవి వద్దంటున్నా వినకుండా మూర్తి పంపిన రవి చిత్రానికి చిత్రకళా పోటీల్లో ప్రథమ బహుమతి లభించింది. ఇంతకాలం అజ్ఞాతంగా ఉండిపోయిన ఒక కళాకారుడి కింతకంటే గొప్ప అనుభవమేముంటుంది?

"నా చిత్రానికి ఫస్ట్ ప్రైజు వచ్చింది సార్?" అంటూ ఆఫీసులోని అందరికీ పేరు పేరునా పిలిచి చెప్పాడు. కేంటీన్లో పార్టీ ఇచ్చాడు—నవ్వాడు, నవ్వించాడు. ఉత్సాహంలో గంతు లేశాడు. పర్మిషన్ తీసుకుని మూర్తి ఆఫీసుకెళ్ళి అతడికీ, అతడింటికెళ్ళి సీతకీ చెప్పాడు. అయినా ఆ ఆనందం తగ్గలేదు. ఇంకా ఎవరికో చెప్పాలి చెప్పాల్సి తనను నిలవనీయటం లేదతన్ని.

కష్టంలో నాకపోయినా సంతోషంలో పాలు

పంచుకునే తన వాళ్ళుంటూ తోడు లేకుంటే ఘోరం నేదన్పించింది రవికి. జ్యోతిని తన జీవన జ్యోతి కమ్మంటే? ఇద్దరి జీవితాల్లోనూ వెలుగే కురుస్తుంది. వెన్నెలే పండుతుంది.

ఇంకేం ఆలోచించకుండా పరుగు పరుగున ఆమె ఇంటివైపు నడవసాగాడు. ఆమెని అమాంతం పైకెత్తేసి గిరగిరా త్రిప్పేసి ఆ శుభవార్తని చెప్పెయ్యాలని తహతహతో పరుగులాంటి నడకతో నడవసాగాడు. అతన్లో నవోత్సాహం నవ చైతన్యం చిందులేస్తుంటే తనకిప్పుడు సంపూర్ణత లభించిందంటూ ఫీలవుతూ పొంగిపోసాగాడు.

"మనసున మనసై బ్రతుకున బ్రతుకై తోడొకరుండిన అదే భాగ్యమూ అదే స్వర్గమూ" అన్న పాట అతడి మానసవీణ మధురంగా ఆలాపిస్తుంది.... *


# బలహీన వర్గాలకు రక్షణ కల్పించండి వారికి సహాయపడండి

హరిజనులమీద, ఇతర బలహీన వర్గాలమీద దాడులు మన సమాజానికి అవమానకరం. ప్రగతి పథంలో మన పయనానికి ఈ దాడులు అడ్డు తగులుతాయి.



భారతీయ సంప్రదాయాన్ని నిలబెడదాం

## మనమంతా ఒకటే

DAVP/537